ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

జాతీయ వార్తలు

తేదీ: 06-04-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

ముఖ్యాంశాలు

- గడచిన దశాబ్ద కాలంలో దేశంలోని మౌలిక సదుపాయాలను బలోపేతం చేశామని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పేర్కొన్నారు.

- దేశ అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందని ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు, కేంద్ర మంత్రి జగత్ ప్రకాష్ నడ్డా తెలిపారు.

- సనాతన ధర్మాన్ని బలోపేతం చేయడానికి ఆధ్యాత్మిక సంస్థలు కృషి చేస్తున్నాయని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు

- కేంద్ర సామాజిక న్యాయం సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో రేపటి నుండి 2 రోజుల పాటు చింతన్ శిబిర్ 2025ను నిర్వహిస్తున్నారు.

- దేశ ప్రజలు శ్రీ రామనవమిని ఈ రోజు ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

గడచిన దశాబ్ద కాలంలో దేశంలోని మౌలిక సదుపాయాలను బలోపేతం చేశామని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తెలిపారు. తమిళనాడులో 8 వేల 300 కోట్ల రూపాయల విలువైన రైలు రోడ్డు ప్రాజెక్టులకు ఈ రోజు ప్రధానమంత్రి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అలాగే, రామేశ్వరంలో పంబన్ వర్టికల్ లిఫ్ట్ సీ బ్రిడ్జిని ప్రారంభించారు. ఈ సందర్భంగా రామేశ్వరంలో జరిగిన బహిరంగ సభలో ప్రసంగిస్తూ... దేశంలోని 4 ప్రాంతాలను అనుసంధానించడానికి మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేశామని చెప్పారు. వర్టికల్ లిఫ్ట్ సీ బ్రిడ్జిని 20వ శతాబ్దపు అద్భుతంగా ఆయన అభివర్ణించారు. తమిళనాడు అభివృద్ధి దేశాభివృద్ధికి దోహదపడుతుందని నరేంద్ర మోడీ పేర్కొంటూ...

(వాయిస్ 27 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలోని వివిధ ప్రాంతాల్లో శ్రీ రామనవమిని ఈ రోజు ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నారు. శ్రీరాముడు జన్మస్థలమైన అయోధ్యలో జరుగుతున్న ఆధ్యాత్మిక వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. శ్రీరామ నవమి సందర్భంగా దేశ ప్రజలకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ శుభాకాంక్షలు తెలిపారు. శ్రీరాముని ఆశీస్సులు ఎల్లప్పుడూ ప్రజాలపైన ఉంటాయని, ప్రయత్నాలన్నింటిలోనూ మార్గనిర్దేశం చేస్తాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సామాజిక మాధ్యమం ద్వారా పేర్కొన్నారు. తెలంగాణా రాష్ట్రంలోని భద్రాచలం

పుణ్య క్షేత్రంలో శ్రీరామ నవమి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. మిథిలా స్టేడియంలో శ్రీ సీతారామ కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఈ కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కాగా రేపు నిర్వహించే శ్రీరామ పట్టాభిషేక మహోత్సవానికి తెలంగాణా రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ హాజరవుతారని ఆలయ అధికార వర్గాలు తెలిపాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ఉత్తరప్రదేశ్ లోని అయోధ్య రామ మందిరంలో శ్రీరామ నవమి వేళ అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. ఆలయంలోని బాలరాముడి నుదుటిపై సూర్యతిలకం కనిపించగానే అక్కడ ఉన్న భక్తులు ఆనందంతో రామనామ స్మరణం చేశారు. కాగా శ్రీరామ నవమిని పురస్కరించుకుని అయోధ్య రామ మందిరంలో వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వామి దర్శనం కోసం దేశవిదేశాల నుంచి భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఆలయంలో బాలరాముడికి సంప్రదాయబద్ధంగా పూజలను అర్చకులు నిర్వహించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

సనాతన ధర్మాన్ని బలోపేతం చేయడానికి దేశంలోని ఆధ్యాత్మిక సంస్థలు ఎంతగానో కృషి చేస్తున్నాయని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. రాజస్థాన్ లోని కోట్ పుట్లి - బెహ్రోర్ జిల్లాలోని పావ్‌టాలో ఈ రోజు జరిగిన ఒక ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... బాబా బల్నాథ్ ఆధ్యాత్మిక సేవలు ప్రశంసనీయమని అన్నారు. ఆయన ప్రజా సంక్షేమం, జంతువులు పక్షులకు

సేవ, పర్యావరణ పరిరక్షణ సామాజిక సామరస్యం కోసం విశేషంగా పని చేశారని పేర్కొంటూ...

(వాయిస్ 29 సెకన్లు)

ఈ కార్యక్రమంలో రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్ లాల్ శర్మ, కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర సామాజిక న్యాయం సాధికారత మంత్రిత్వ శాఖ రేపటి నుండి 2 రోజుల పాటు ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో చింతన్ శిబిర్ 2025ను నిర్వహిస్తోంది. ఈ రెండు రోజుల జాతీయ సమీక్షా సమావేశం ద్వారా దేశంలో అమలవుతున్న సామాజిక న్యాయం సంక్షేమ కార్యక్రమాల గురించి సమగ్రంగా చర్చిస్తారు. ఈ కార్యక్రమం కేంద్ర, రాష్ట్రాల మధ్య సమన్వయాన్ని మెరుగుపరచడంతో పాటు అట్టడుగు స్థాయిలో ప్రభుత్వ సేవలను సమర్థవంతంగా అందించడానికి దోహదపడుతుందని భావిస్తున్నారు. ఈ సమావేశానికి కేంద్ర సామాజిక న్యాయం సాధికారత మంత్రి డాక్టర్ వీరేంద్ర కుమార్, సహాయ మంత్రులు శ్రీ రామ్‌దాస్ అథవాలే బి.ఎల్. వర్మ అధ్యక్షత వహిస్తారు. అలాగే ఈ కార్యక్రమానికి దేశంలోని వివిధ రాష్ట్రాలు కేంద్రపాలిత ప్రాంతాల నుండి 21 మంది మంత్రులు హాజరుకానున్నారని అధికార వర్గాలు తెలిపాయి.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశ అభివృద్ధి కోసం భారతీయ జనతా పార్టీ కట్టుబడి ఉందని ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు, కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జగత్ ప్రకాష్ నడ్డా పేర్కొన్నారు. బీజేపీ 45వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో ఈ రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ... బీజేపీ తన సిద్ధాంతాలతో ఎప్పుడూ రాజీపడలేదని అన్నారు. భారతీయ సంప్రదాయం సంస్కృతికి అనుబంధంగా పార్టీ సిద్ధాంతం ఉందని గుర్తు చేశారు. శ్యామా ప్రసాద్ ముఖర్జీ, పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ, అటల్ బిహారీ వాజ్‌పేయి, లాల్ కృష్ణ అద్వానీ వంటి వారు పార్టీకి సారధ్యం వహించారని ఆయన చెప్పారు. దేశాన్ని అభివృద్ధి పధంలోకి నడిపేందుకు బీజేపీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం కృషి చేస్తోందని జేపీ నడ్డా పేర్కొంటూ...

(వాయిస్ 26 సెకన్లు)

కాగా భారతీయ జనతా పార్టీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా సామాజిక మాధ్యమం ద్వారా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పార్టీ కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీలంక అభివృద్ధి ప్రయాణానికి భారతదేశం మద్దతు ఇవ్వడం గర్వంగా ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఆ దేశంలో సాగిన తన పర్యటన ద్వైపాక్షిక సంబంధాలను పటిష్టం చేస్తుందని ఈ రోజు సామాజిక మాధ్యమం ద్వారా ప్రధానమంత్రి పేర్కొన్నారు. ఇది రెండు పొరుగు దేశాల మధ్య దీర్ఘకాలిక సంబంధాలలో కొత్త అధ్యాయాన్ని సూచిస్తుందని చెప్పారు. తన పర్యటన సందర్భంగా అందించిన ఆప్యాయతకు శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార

దిసనాయకేతో పాటు ఆ దేశ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా, ప్రధానమంత్రి శ్రీలంకతో కలుపుకుని తన మూడు రోజుల విదేశీ పర్యటనను పూర్తి చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

వక్ఫ్ సవరణ బిల్లు-2025కు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోద ముద్ర వేశారు. దీంతో వక్ఫ్ సవరణ బిల్లు చట్టంగా మారింది. వక్ఫ్ రద్దు బిల్లు- 2025కు కూడా రాష్ట్రపతి ఆమోదాన్ని తెలిపారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ కేంద్ర ప్రభుత్వం ఓ ప్రకటనను విడుదల చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

పంజాబ్‌లోని సీనియర్ రైతు నాయకుడు జగ్జిత్ సింగ్ దల్లెవాల్ ఈరోజు ఫతేఘర్ సాహిబ్‌లో తన నిరాహార దీక్షను ముగించారు. కేంద్ర వ్యవసాయం రైతు సంక్షేమ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ దల్లెవాల్‌కు తన నిరాహార దీక్షను విరమించాలని సామాజిక మాధ్యమ ద్వారా విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందనగా ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. కాగా, వ్యవసాయ పంటలకు కనీస మద్దతు ధర విషయంలో చట్టపరమైన హామీతో సహా రైతుల డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ గత సంవత్సరం నవంబర్ 26వ తేదీ నుండి ఆయన నిరాహార దీక్ష చేస్తున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలోని పౌరులందరికీ సమాన అవకాశాలను కల్పించడమే భారత రాజ్యాంగ స్ఫూర్తి అని  లోకసభ స్పీకర్ ఓం బిర్లా అన్నారు.  ఉజ్బెకిస్తాన్‌లోని

తాష్కెంట్‌లో జరిగిన “పార్లమెంటరీ యాక్షన్ ఫర్ సోషల్ డెవలప్‌మెంట్ అండ్ జస్టిస్” అనే అంశంపై ఇంటర్-పార్లమెంటరీ యూనియన్ (ఐపియు) 150వ అసెంబ్లీని ఉద్దేశించి  ఈ రోజు ఆయన ప్రసంగించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = = = =